క్లుప్తంగా

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోండి



ఉపాధిహామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ గంగాధరం

ఏర్పేడు: ఉపాధిహామీ పథకాన్ని పేదలు సద్విని యోగం చేసుకోవాలని సర్పంచ్ గంగాధరం అన్నారు. బుధవారం మండలంలోని మేర్లపా కలో ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ రెండేళ్ల కిత్రం రాజీనామా చేశారని, అప్పటి నుంచి పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులు చేపట్టలేదన్నారు. ఇటీ వల కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామా ల్లో కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయ కుడు కేశవులు, ప్రదీప్, లోకేష్, కూలీలు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరుడి సేవలో తమిళనాడు ఐఏఎస్



చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటపల్లెలోని పల్లికొండేశ్వరస్వామివారిని బుధవారం తమిళ నాడు రాష్ట్ర ఐఏఎస్ అధికారి పళణిస్వామి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారు లు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనం తరం ఆలయ ప్రదోష మండపంలో వేద ఆశీర్వ చనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే పెరియపాళయం శ్రీ భవాని అమ్మవారి దేవ స్థానం కార్య నిర్వాహణ అధికారి ప్రకాష్ కూడా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారి వెంట ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, అర్చకులు కార్తికేశన్, సతీశ్ శర్మ, గణేష్ శర్మ ఉన్నారు.

అధ్వానంగా కొత్తపాళెం రోడ్డు



గుంతలమయమై ఉన్న కొత్తపాళెం రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్త పాళెం గ్రామానికి కేటీరోడ్డు మీదుగా వెళ్లే రహదారి గుంతలమయమై అధ్వానంగా ఉంది. దీంతో గ్రామస్తులు, తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. కేటీరోడ్డు నుంచి కొత్తపాళెం గ్రామానికి రెండు కిలోమీటర్లు తారురోడ్డు ఉంది. ఈ రోడ్డు దెబ్బతిని, గుంతలమయమై అధ్వానంగా ఉం ది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొ చ్చుగా తయారైంది. రోడ్డుపై గ్రామస్తులు నడవ డానికి ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహ నాలు, కార్లు నడపడం కష్టమవుతోంది. వాహ నచోదకుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసి న పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నా రు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని గ్రామ స్తులు కోరుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



కోవూరుపాడులో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వరదయ్యపాళ్యం: తాళం వేసి, ఉన్న ఇంట్లో దుండగులు చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని కోవూరుపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామా నికి చెందిన ఎస్.ప్రభావతి శ్రీ సిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తుంది. విధి నిర్వహ ణలో భాగంగా మంగళవారం యథావిధిగా మధ్యాహ్నం షిఫ్టుకు కంపెనీకి వెళ్లింది. ఇంటి వద్ద ఆమె తల్లి ఉండగా సాయంత్రం 4 గంటల సమయంలో ఆమె ఇంటికి తాళం వేసుకుని అక్కడికి సమీపంలోని మరో ఇంటి వద్దకు వెళ్లింది. ఆమె అర్ధగంట తరువాత తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం తెరిచి ఉండడాన్ని గమనించి లోనికి వెళ్లి, పరిశీలించింది. అయితే ఆమె కుమార్తె రాత్రి 11 గంటల సమయంలో కంపెనీ నుంచి ఇంటికి రాగానే బెరువా తెరిచి చూడగా అందులో ఉన్న 6 సవర్ల బంగారు నగలు 200 గ్రాములు వెండి, రూ.15 వేలు నగదు దోచుకెళ్లి నట్టు గుర్తించారు. బాధిత మహిళ వెంటనే బుధవారం ఉదయం వరదయ్యపాళ్యం పోలీసు లకు సమాచారం అందించింది. దీంతో ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ షణ్ముగం సంఘటనా స్థలానికి చేసుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





భృతి సంగతేంటి?

20 లక్షల ఉద్యోగాలు అన్నారు.. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఊరూరా ఊదరగొట్టారు.. ఓట్లు కొల్లగొట్టారు.. తీరా గెలిచాక మౌనం వహించారు. ఎన్నికల ముందు తొలి సంతకం మెగా డీఎస్సీ అంటూ ఊరించి.. ఉసూరుమనిపించగా.. భృతి అయినా వస్తుందిలే అంటూ.. ఆ అత్తెసరు పోస్టుల కోసం చేస్తున్న చిన్నా చితకా ఉద్యోగాలు మానుకుని శిక్షణ పొందుతున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వ తీరు శరాఘాతంగా మారింది. డీఎస్సీ నిర్వహణపై స్పష్టత లేక.. నిరుద్యోగ భృతి రాక సర్కారుపై యువకులు మండిపడుతున్నారు. బాబు మోసపూరిత వైఖరి తెలిసీ మోసపోయామని ఆవేదన చెందుతున్నారు.

- అధికారంలోకి వచ్చాక మౌనం
- నిరీక్షిస్తున్న నిరుద్యోగ యువత
- గతంలో మాదిరి మొండిచెయ్యేనా?

వరదయ్యపాళ్యం/రేణిగుంట : అధికారంలోకి రాక ముందు ఓ మాట.. వచ్చిన తరువాత మరో మాట..ఒట్టి య్యకుండా ఒక మాట చెప్పడు ఈ ఛత్రపతి అన్న రేంజ్‌లో నోటికొచ్చిన హామీలిచ్చి..వాటిని తుంగలో తొక్కడం.. లేదంటే నిబంధనల ఛట్రంలో బందీలుగా మార్చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తల్లులందరికీ వందనమంటూ వంగి వంగి నమస్కారాలు పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఒక్క తల్లికే వందన మంటూ మాట మార్చేశారు. అధికారంలోకి వచ్చిన వెం టనే ఇంటికో ఉద్యోగం.. లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పడంతో ఎదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులకు కూ టమి ప్రభుత్వం వెన్నుపోటు పొడి చేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వం ఏర్పడి నెల దాటినా దాని ఊసే లేకపోవడంతో అసలు భృతి ఇస్తారా? ఇవ్వరా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

ఇంటికో ఉద్యోగం వస్తుందా?

నిరుద్యోగ భృతి లేదంటే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ మేరకు వరద య్యపాళ్యం, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో మొత్తం ఇళ్ల సంఖ్య ఆధారంగా వేలాది మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. కానీ గతంలో జాబు కావాలంటే.. బాబు రావాలని ఊదరగొట్టి, అందరికీ మొండిచెయ్యి చూపించిన చంద్రబాబు ఈ సారీ అదే వైఖరి అవలంబిస్తారేమోనంటూ నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. హామీలను నమ్మిన ప్రతిసారీ చంద్రబాబు ప్రభుత్వం చేతిలో మోసపోతున్నామంటూ వాపోతున్నారు.

నెల గడిచినా ఊసెత్తని సర్కారు

మరోసారి ఇంటికో ఉద్యోగం..లేదంటే ప్రతి నిరు ద్యోగికీ రూ.3 వేలు భృతి అని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెల దాటుతున్నా దీనిపై కనీసం సమీక్ష చేయడం గానీ, అధికారులకు ఆదేశాలు జారీ చేయడం కానీ జరగలేదు. వరదయ్యపాళ్యం, శ్రీకాళహస్తి నియో జకవర్గాల్లో మొత్తం 1,61,585 కుటుంబాలు ఉన్నాయి. ఈ ఇళ్లలో సుమారు 50 వేల మంది పైగా నిరుద్యోగులు ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికీ నెలకు రూ.3 వంతున భృతి ఇవ్వాల్సి ఉంటుంది.

2014లోనూ అదే అబద్ధం

2014లోనూ అదే అబద్ధంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. నాలుగున్నరేళ్ల సాగదీసిన తరువాత ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తెరపైకి తీసుకొచ్చారు. తొలుత ఇంటింటికీ ఉద్యోగం..లేదంటే ప్రతి నిరుద్యోగికి రూ.2వేలు భృతి అని ప్రకటించి, చివరకు రూ.వెయ్యి మాత్రమే ఇస్తామన్నారు. పోనీ..అదైనా నిరుద్యోగులందరికీ సక్రమంగా ఇచ్చారా అంటే.. అందులోనూ రోజుకో కొత్త నిబంధనను తీసుకొచ్చి..నిరుద్యోగులకు ముచ్చెమటలు పట్టించారు. ఇంట్లో ఎవరికీ ఉద్యోగం ఉండకూడదని, రూ.50 వేలకు మించి రు ణం ఉండకూడదని సవాలక్ష ఆంక్షలు విధించారు. దీంతో ఈ పథకం నిరుద్యోగులకు అందని ద్రాక్షగా మారింది.

శ్రీకాళహస్తి నియోజకవర్గ వివరాలివీ...

మండలం	కుటుంబాలు సంఖ్య	నిరుద్యోగులు
1. శ్రీకాళహస్తి	34,119	7,539
2. రేణిగుంట	19,733	5,218
3. ఏర్పేడు	21,945	4,895
4. తొట్టంబేడు	13,777	3,739
	89,574	21,391

సత్యవేడు నియోజకవర్గ కుటుంబాల వివరాలివీ..

వరదయ్యపాళ్యం	:	11,567
పిచ్చాటూరు	:	8,739
నాగలాపురం	:	8,728
సత్యవేడు	:	13,561
కె.వి.బి.పురం	:	10,875
బి.ఎన్. కండ్రిగ	:	9,175
నారాయణవనం	:	9,366
మొత్తం	:	72011

వాగ్దానం నిలబెట్టుకోవాలి



నిరుద్యోగులందరికీ భృతి ఇచ్చి, సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. రాష్ట్రంలోని నిరుద్యోగులందరికి నిరుద్యోగ భృతి అందించాలి. నేను డిగ్రీతోపాటు డీఎడ్ చేసి ఉన్నాను. నాతోపాటు ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతోపాటు నిరుద్యోగుల ప్రిపరేషన్‌కు ఉపయోగపడేలా నిరుద్యోగ భృతిని ఇచ్చి వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి.

– రూపేష్‌కుమార్, నిరుద్యోగి, రేణిగుంట మండలం

భృతి వస్తే ఆసరా



మాది ఏర్పేడు మండలంలోని చిందేపల్లి గ్రామం. ఇంటర్మీడియేట్ పూర్తి చేశాను. ఆర్థిక స్తోమత లేక ఉన్నత చదువులు చదవలేదు. ఉద్యోగం లేక ఖాళీగా ఇంటి వద్దనే ఉంటున్నాను. ప్రస్తుతం కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి పంపిణీ చేస్తే నాకు ఎంతోతో ఆసరాగా ఉంటుంది. మా కుటుంబానికి ఆర్థిక భారం తగ్గుతుంది. నా ఉద్యోగాన్వేషణకు తోడవుతాది.

–మునికుమార్, నిరుద్యోగి, చిందేపల్లి, ఏర్పేడు మండలం

నిరుద్యోగ భృతి కోసం వేచి చూస్తున్నా



నేను బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ప్రస్తుతం ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నాం. నిరుద్యోగ భృతి అమలు చేయడానికి వెంటనే విధివిధానాలు విడుదల చేసి స్పష్టత ఇవ్వాలి. ఇచ్చిన హామీ విస్మరిస్తే ఆ ప్రభావం హామి వేల కుటుంబాలపై చూపుతుంది.

– లోకేష్, నిరుద్యోగి, పాండూరు, వరదయ్యపాళ్యం మండలం

తక్షణమే భృతి ఇవ్వాలి



మాది పేద వ్యవసాయ కుటుంబం, నేను బీఎస్సీ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. ఉద్యోగం వచ్చేంత వరకు కూటమి ప్రభుత్వం రూ.3 వేలు భృతి చెల్లించాలి. నేను కుటుంబసభ్యులపై ఆధారపడి జీవిస్తున్నాను. తక్షణమే నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– వేణ, నిరుద్యోగి, రాచర్ల అరుంధతివాడ, వరదయ్యపాళ్యం మండలం

ఆర్థిక భారం తగ్గుతుంది



నేను బీఎస్సీ పూర్తి చేశాను. ఇప్పటివరకు ఉద్యోగం రాలేదు. నేను వ్యా పారిగా జీవనం సాగిస్తున్న నా భర్తపై ఆధా రపడి బతుకుతున్నాను. కూటమి ప్రభు త్వం ఎన్నికల్లో ప్రకటించిన రూ.3 వేలు భృతి చెల్లిస్తే కొంత ఆర్థిక వెసులుబాటు వస్తుంది. నా కుటుంబంపై ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తే దరఖాస్తు చేసుకుంటాం. ఏది ఏమైనా ఇచ్చిన హామి అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావాలి.

– హరిప్రియ, నిరుద్యోగి, నాగలాపురం మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నేను ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. ఎంప్లాయిమెంటు ఆఫీసులో కూడా దరఖాస్తు చేసుకున్నాను. మంచి ఉద్యోగం వస్తే కుటుంబాన్ని పోషించుకునే వీలు కలుగుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి గానీ, ఉపాధి గానీ కల్పిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. అప్పుడే బాబుపై నమ్మకం కలుగుతుంది.

– ఎం.లోకేష్, వినోభానగర్, నాగలాపురం మండలం

భక్తిశ్రద్ధలతో మొహర్రం



అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, వెస్టువరత్తూరు, కాటూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కంచనపుత్తూరు గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకుని పీర్ల పండుగను బుధవారం ముస్లింలు, హిందువులు కలసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దర్గాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ముందు రోడ్డు వేసి.. ఆపై బస్సు నడపండి సార్

నాగలాపురం: పూర్తిగా ఛిద్రమైన నాగలాపురం టీపీ కోట రోడ్డును పునర్నిర్మించి బస్సు సర్వీసులను నడపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని ఆ ప్రాంత వాసులు వేడుకున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు నాగలాపురం నుంచి టీపీ కోట మీదుగా సత్యవేడుకు రెండు అదనపు ఆర్టీసీ బస్సు సర్వీసులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఆ సమయంలో అదనపు బస్సు సర్వీసులు మాట దేవుడెరుగు.. రాకపోకులకు రోడ్డు నిర్మించి పుణ్యం కట్టుకోండి సార్ అంటూ స్థానికులు గుసగుసలాడుకున్నారు. నాగలాపురం నుంచి టీపీ కోట వరకు వెళ్లాలంటే తల ప్రాణం తోకకొస్తుంది... ప్రమాదాలు జరిగినప్పుడు ఆంబులెన్స్ కూడా వెంటనే రాలేనంత దారుణంగా రోడ్డు ఉందని స్థానికులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు డిపో మేనేజర్ వెంకటరమణ, ఆర్టీసీ కానిస్టేబుల్ పవన్ కుమార్, టీడీపీ నాయకులు శ్రీనివాస యాదవ్, ఎస్ఎం.సురేష్, ప్రనీత్, సునీల్ కుమార్, ఎండీ.కుమార్ నెల్సన్ మండేలా, వెంకటేశులు పాల్గొన్నారు,

ఉత్సవాలను విజయవంతం చేద్దాం



అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ, డీఎస్పీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నైరోడ్డులో ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామివారి ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేద్దామని ఈఓ ఎస్వీఎస్ఎన్ మూర్తి, డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం ఆలయ పరిపాలన భవనంలో పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా శుక్రవారం జరిగే అర్జున తపస్సు, ఆదివారం జరిగే అగ్నిగుండ మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తారన్నారు. ఈ రెండు రోజులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వారు ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇక అగ్నిగుండం మహోత్సవం రోజున అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నూకా రత్నం, మల్లికార్జున ప్రసాద్, కృష్ణారెడ్డి, సతీష్ మాలిక్, నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



ప్రకాశం పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని చేపల మార్కెట్, శంకర్ కాలనీ, మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రకాశం పార్కును హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి ఆమె బుధవారం పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, పార్కుల నిర్వహణ సరిగా లేకపోవడంతో కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. మరోసారి నిర్వహణ లోపం తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కమిషనర్ మాట్లాడుతూ పార్కులలో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ బాగుండాలని సూచించారు. తొలుత మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా రాజసూయయాగం



శ్రీకాళహస్తి: పట్టణంలోని చెన్నైరోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాజసూయయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామివారి ఆలయంలో యాగపూజలు చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను చప్పరంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

పల్లికొండేశ్వరాలయంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ చైర్మన్ కె.రామచంద్రారెడ్డి భక్తుల దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సతీష్‌శర్మ, గణేష్, శరవణ, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు అందించాలి



స్విమ్స్ అధికారులతో సమావేశమైన టీటీడీ యూనియన్ నాయకులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగులకు స్విమ్స్‌లో మెరుగైన వైద్యసేవలు అందించాలని టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ కోరారు. బుధవారం స్విమ్స్ ఆసుపత్రిలోని వైస్ చాన్సలర్, డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్, డాక్టర్ రామ్, డాక్టర్ వివేక్, ఎంఆర్‌డీ మురళీలతో జరిగిన సమావేశంలో పలువురు టీటీడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. టీటీడీ నిధులతో నడుస్తున్న స్విమ్స్ హాస్పిటల్‌ను ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి గతంలో ఉన్న విధంగా ఉద్యోగులకు, పెన్షనర్లకు ఉచిత సేవలు అందించాలని కోరారు. వంద పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో టీటీడీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆనందరాజు, డాక్టర్ నర్మద, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్ యాదవ్, సభ్యులు హర్ష పాల్గొన్నారు.

ఉద్యమ రైతుల హామీలు అమలయ్యేలా చూడండి

- ఎంపీ గురుమూర్తికి ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి వినతి



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు

తిరుపతి మంగళం: ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా చూడాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తిని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం వారు తిరుపతిలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 2020–21 రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రాత పూర్వక హామీలను అన్ని పంటలకు సి2+50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం అమలు, రైతులు, వ్యవసాయ కార్మికులకు ఒకసారి రుణవిముక్తి చేసి వ్యవసాయ ఆత్మహత్యల నివారణ, వ్యవసాయానికి స్మార్ట్‌మీటర్ల రద్దు, అన్ని పంటలకు సమగ్ర పంటల బీమా, రైతులు, వ్యవసాయ కార్మికులకు పంటల బీమా, రైతు అనుకూల భూసేకరణ చట్టం లాంటి మొదలగు హామీల అమలు కోసం పార్లమెంటులో చర్చించి కృషి చేయాలని ఎంపీని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ కరువు, అకాల వర్షాలు, వరదలతో లాంటి ప్రకృతి విపత్తులతో రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం అన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధరతో పాటు పంటల బీమా అవసరం అన్నారు. వ్యవసాయం చేస్తూ వయసు మళ్లిన రైతులకు పెన్షన్ విధానం ఏర్పాటు చేయాలని, రైతు కూలీల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇవ్వాలని జీడీపీలో రైతుల సమస్యలకు సంబంధించి కచ్చితమైన వాటా ఉండాలని ఇలా పలు సమస్యలపై ఇప్పటికే కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. వాటితో పాటు ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి వారు చెప్పిన అంశాలపై పార్లమెంటులో చర్చించడమే కాకుండా సంబంధిత శాఖల మంత్రులతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ గురుమూర్తి తెలిపారు. రైతు సంఘాల నాయకులు రామానాయుడు, కేతారి రాధాకృష్ణ, మురళి, పెంచులయ్య తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న దళిత సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగానున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఫ్లెక్సీలు కట్టి అవమాన పరచడం పాలకులకు తగదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య తెలిపారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కలుద్దాం... ఫ్లెక్సీలు తొలగిద్దాం కదిలిరండి పిలుపుతో ఆయన బుధవారం సాయంత్రం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి ఫ్లెక్సీలు కట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ భవన్ కమిటీ ప్రతినిధి డాక్టర్ గోపి, తిరుమల తిరుపతి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నేత ప్రసాద్‌రావు, ఎస్సీ సంక్షేమ సంఘం నేత ధనశేఖర్, చిన్నం కాళయ్య, శ్రీను, కేవీపీఎస్ గోవిందయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి ఉత్సవం



సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్న పురవీధుల్లో ఊరేగారు.

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాలకడలి మథనానంతరం మహావిష్ణువు శయనించిన రోజు నుంచి తెలుగు పండుగలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య పేర్కొన్నారు. ఆషాఢ మాసం శుక్లపక్ష ఏకాదశిని తొలి ఏకాదశిగా, శయన ఏకాదశిగా కొలుస్తారన్నారు.